ప్రజాశక్తి

గురువారం 16 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేటి నుంచి గ్లోబల్ టెక్ సమ్మిట్

- వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- వివరాలు వెల్లడించిన కో-కన్వీనర్ గేదెల శ్రీనుబాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, సీతమ్మధార

సిరిపురంలోని వివిఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ఈ నెల 16,17 తేదీల్లో గ్లోబల్ టెక్ సమ్మిట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గ్లోబల్ టెక్ సమ్మిట్ కో-కన్వీనర్, పల్సస్ కంపెనీ సిఇఒ గేదెల శ్రీనుబాబు బుధవారం సత్యం జంక్షన్ వద్ద ఉన్న పల్సస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గురువారం ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, 11:15 గంటలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఉపన్యాసం చేస్తారని శ్రీనుబాబు తెలిపారు. సదస్సుకు జి-20 దేశాలతో పాటు 25 దేశాల నుంచి దాదాపు వెయ్యి మంది వరకు హాజరవుతారని చెప్పారు. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, రాజన్నదొర పాల్గొంటారని తెలిపారు. సదస్సులో భాగంగా అధునాతన పద్ధతిలో యూరోపియన్ టెక్నాలజీ ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తులపై చర్చ జరుగుతుంది చెప్పారు. దీనికి సంబంధించి బిజినెస్ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటుచేసి వ్యవసాయ ఉత్పత్తుల గురించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఫార్మా రంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పరంగా బడ్జెట్‌ను తగ్గించి సులభ పద్ధతిలో తక్కువ ధరకు వినియోగదారులకు అందే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. టెక్నాలజీ పరమైన అంశాలు చర్చిస్తారని తెలిపారు. 200 ఫార్మా, 200 ఐటీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారు. ఎయు విసి పివిజిడి.ప్రసాదరెడ్డి, ఐటి ఇ అండ్ సి విభాగం సెక్రటరీ సౌరభ్‌గౌర్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ టివి,నారాయణ తదితరులు భారతదేశంలో వైద్య, ఆరోగ్య రంగం స్థితి, ఎదుర్కొంటున్న సవాళ్లు, అందుబాటులో ఉన్న వైద్యంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మన రైతులకు యూరోపియన్ వ్యవసాయ విధానం గురించి నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఎమ్‌డి కమోడోర్ అమిత్ రస్తోగి వివరిస్తారని తెలిపారు. ఫార్మా రంగంలో కొత్త టెక్నాలజీపై ప్రత్యేక కోర్సులు కూడా ప్రవేశపెట్టేందుకు ఈ సదస్సులో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. టెక్ సమ్మిట్‌లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూరోపియన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ సెంటర్ (ఇండియా), బ్రిటిష్ హైకమిషన్ (న్యూఢిల్లీ), సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఇండియా, సివిల్20 గ్రూప్, టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఫోర్‌కాస్టింగ్, అసెస్‌మెంట్ కౌన్సిల్, డిఎస్‌టి, ఇండియా సంస్థలన్నీ భాగస్వాములయ్యారని తెలిపారు.

నేడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

రమాప్రభ నామినేషన్

సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన

భారీగా తరలిరానున్న పట్టభద్రులు, ప్రజానీకం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల వేదిక బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు డాబాగార్డెన్స్ సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన జరుగనుంది. అనంతరం ఆమె నామినేషన్ వేస్తారు. ఈ కార్యక్రమానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవి), వేదిక నాయకులు, ముఖ్యులు హాజరుకానున్నారు. రమాప్రభ సామాజిక కార్యకర్తగా ఉత్తరాంధ్రలో విశేష ప్రాచుర్యం పొందారు. ఆమెను అన్ని తరగతులవారూ ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె నామినేషన్ కార్యక్రమానికి భారీగా పట్టభద్రులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు హాజరుకానున్నారు.

తోపుడు బళ్ల తరలింపు అడ్డగింత

వార్త 3లో..

నారా లోకేష్ ఆరోపణలపై సిబిఐ విచారణ కోరా : పొద్దుటూరు ఎమ్మెల్యే

▶ వార్త మెయిన్‌లో..

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికుల ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

తుక్కు విక్రయాల్లో అవకతవకలపై సమగ్ర విచారణ

▶ వార్త 3లో..

జి20 సమావేశాలకు ఏర్పాట్లు

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్, 28, 29, 30 తేదీల్లో జరగనున్న జి-20 సమావేశాలకు ముమ్మర ఏర్పాట్లు చేపట్టామని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. జివిఎంసి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ సమావేశాల నేపథ్యంలో విశాఖ నగరంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశాలకు జివిఎంసి తరుపున సుందరీకరణ, రోడ్ల మరమ్మత్తులు, పెయింటింగ్, బీచ్ డెవలప్‌మెంట్, జంగిల్ క్లీనింగ్ విభాగాల్లో పనులు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. నగరంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తులకు ప్రత్యేక వెండింగ్ జోన్లు ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. రవాణాకు ఇబ్బంది లేకుండా ఖాళీగా ఉన్న సర్వీస్ రోడ్లలో ఈ వెల్డింగ్ జోన్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. తెలుగుతల్లి వంతెన కింద ఉన్న ప్రాంతమంతా మొక్కలతో సుందరంగా తయారు చేస్తామని తెలిపారు. జివిఎంసి కార్యాలయంలో డోర్ లాకింగ్ సిస్టమ్‌పై వివరణ ఇస్తూ ఉద్యోగులు కార్యాలయంలో ఎంత సమయం ఉంటున్నారన్న విషయం నిర్ధారణ అవుతుందని చెప్పారు. ఉద్యోగులను మానిటరింగ్ చేసేందుకే ఈ ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నామని, సాధారణ

మిగతా 2లో..

మీ సేవా కేంద్రాలు నిర్వీర్యం

ప్రభుత్వ తాజా నిర్ణయాలతో రోడ్డున పడనున్న నిర్వాహకులు

రెండు నెలలుగా జమ కాని కమీషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒకప్పుడు అర్జీదారులు ఏ పథకం కోసమైనా మీ - సేవా కేంద్రాలను ఆశ్రయించేవారు. దీంతో ఎప్పుడు చూసినా ఆ కేంద్రాల వద్ద రద్దీ కనిపించేది. వైసిపి అధికారంలోకి వచ్చాక తీసుకున్న పలు నిర్ణయాలతో మీ సేవా కేంద్రాలు నిర్వీర్యమవుతున్నాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. గతంలో మీ సేవా కేంద్రాల్లో 150కి పైగా సేవలు లభిస్తుండేవి. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పలు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో క్రమేపీ మీ సేవా కేంద్రాలకు వినియోగదారులెవరూ వెళ్లడం లేదు. అంతేకాకుండా మీ సేవా కేంద్రాల్లో పలు పౌర సేవలను సైతం తగ్గించేలా ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. రెవెన్యూకు సంబంధించిన మ్యుటేషన్, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు వంటి సేవలను ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే నిలుపుదల చేసింది. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత మరికొన్ని సేవలను నిలుపుదల చేసింది. దాంతో ప్రజలు పథకాల లబ్ధి కోసం మీ సేవా కేంద్రాలను కాకుండా సచివాలయాలను ఆశ్రయిస్తున్నారు. మీ సేవా కేంద్రాల్లో ఇన్‌కం, కేస్ట్, అడంగల్, ఈ - పాస్ బుక్, ఆధార్ చేర్పులు, మార్పులు లాంటి సేవలు లభిస్తుండేవి. ప్రస్తుతం అడంగల్, ఓపెన్ బి సేవలకే పరిమితం చేయడంతో మీ సేవా కేంద్ర నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీనికి తోడు గత రెండు నెలల నుంచి ప్రభుత్వం మీ సేవా కేంద్రాల నిర్వహణకు ఇవ్వాల్సిన కమిషన్ కూడా ఇవ్వకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వ పథకాల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా ఇచ్చే ఆదాయం, కులం సర్టిఫికెట్లు చెల్లవని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మంజూరు చేసిన ఆదాయ, కుల సర్టిఫికెట్లు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మీ సేవా కేంద్రాలు నిర్వీర్యం

మాత్రమే జత చేయాలని విఆర్ఒలు, వాలంటీర్లు చెబుతున్నారు. నిజానికి మీ సేవా కేంద్రాలు, సచివాలయ కేంద్రాల్లో ఆదాయం, కుల సర్టిఫికెట్లు ఒకేలా వస్తున్నాయి. అయినప్పటికీ మీ సేవ సర్టిఫికెట్లు చెల్లవని ప్రచారం చేస్తున్నారు. దీంతో మీ సేవా కేంద్రాల వారు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో సిఎంఎస్ ద్వారా 711, ఎపి ఆన్‌లైన్ ద్వారా 226, రామ్ ఇన్ఫో ద్వారా 643 మీ సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. విశాఖ నగరంలో ప్రతి వార్డులో కనీసం మూడు చొప్పున మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని వార్డుల్లో అంతకంటే ఎక్కువ ఉన్నాయి కూడా. నగర పరిధిలో సుమారు 400 వరకూ మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో నిర్వహణ సాగడం లేదని, నిర్వహణ కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని నిర్వాహకులు వాపోతున్నారు. కరెంట్ బిల్లులు, నెట్ బిల్లులు కూడా చెల్లించుకోలేకపోతున్నామన్నారు. పొమ్మనకుండా పొగ పెట్టినట్లుగా ప్రభుత్వ నిర్ణయం ఉందని విమర్శిస్తున్నారు. ఎప్పటినుంచో వీటి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న తమను రోడ్డు పాలు చేయడం భావ్యంకాదని వాపోతున్నారు. ఈసరికే మూడు ఏజెన్సీలకు చెందిన 793 మీ సేవా కేంద్రాలు మూతపడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్వం వలే మీ సేవా కేంద్రాలు కొనసాగేలా చూడాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కమీషన్ చెల్లించని ప్రభుత్వం

వేగంగా ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో 2012లో వీటిని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎపి ఆన్‌లైన్, సిఎంఎస్, రామ్ ఇన్ఫో ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 1580 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. సేవల సర్వీసుల ఆధారంగా ప్రభుత్వం కమీషన్‌ను ప్రతి నెలా 5న జమ చేసేది. ఇప్పుడు రెండు మాసాలుగా కమీషన్ చెల్లించలేదు. సేవలు తగ్గడంతో వచ్చే కమీషన్ కూడా తగ్గింది. అది కూడా ప్రతి నెలా కచ్చితంగా చెల్లించే పరిస్థితి లేదు. ఈ కేంద్రాలకు చెందిన నిర్వాహకులు ఆందోళన చేస్తే అప్పుడు ప్రభుత్వం స్పందించి ఒక నెల కమీషన్ జమ చేయడం, ఆ తర్వాత మళ్లీ విస్మరించడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం నిర్ణయంలో మార్పు లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవా కేంద్రాలన్నింటినీ మూసివేసి, వాటిని నిర్వహిస్తున్న వారికి గ్రామ, వార్డు సచివాలయాలలో ఇవే సేవలు వారి ద్వారా అందేలా చేస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు వేతనం ఇస్తే చాలని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం స్పందిస్తుందా ? లేదా ? అనేది తెలియాల్సి ఉంది.

జి 20 సమావేశాలకు ఏర్పాట్లు

ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఫ్రంట్ డెస్క్ ఏర్పాటుచేస్తామని, అక్కడి నుంచి వారు వెళ్లాల్సిన విభాగానికి అక్కడ ఉండే అటెండర్ ద్వారా అనుమతి కల్పిస్తామని తెలిపారు. ఆర్‌కె.బీచ్‌లో రద్దీని నివారించేందుకు ప్రత్యామ్నాయంగా జోడిగుళ్లపాలెం, సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్ వద్ద సముద్రతీరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. బెంచీలు, టాయిలెట్లు, లైట్లు, 40 సీసీ కెమెరాలతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆటోమేటిక్ స్పీడ్ రికార్డర్లను ప్రత్యేక వెండింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శానిటేషన్‌కు సంబంధించిన అన్ని కాంట్రాక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని, భీమిలి డంపింగ్ తప్ప అన్ని డంపింగ్ యార్డులలో చెత్తను ఇప్పటికే తొలగించామన్నారు. గాజువాక, పెందుర్తి, భీమిలి ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా ఉన్న పందులు సంచారాన్ని శాశ్వతంగా నివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం ఉన్నందున వాటి స్థానంలో డిజిటల్ బోర్డులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఎన్ఎస్‌టిఎల్ నుంచి అప్పుఘర్ వరకు 6 ప్రయివేటు సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ధరలు, టైమ్ లైన్‌లను వచ్చే కౌన్సిల్ సమావేశంలో పెట్టి నిర్ణయిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జివిఎంసి గిఫ్ట్ కూపన్ తిప్పి పంపిన స్టాలిన్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి బడ్జెట్ సందర్భంగా కార్పొరేటర్లకు రూ.15 వేలు చొప్పున ఇచ్చిన గిఫ్ట్ కూపన్‌ను 72వ వార్డు సిపిఐ కార్పొరేటర్ ఎజె స్టాలిన్ తిరస్కరించారు. మంగళవారం ఈ కూపన్‌ను జివిఎంసి కార్యాలయంలో ఇచ్చేశారు. ఇప్పటికే సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తిరస్కరించి వెనక్కి ఇచ్చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ, ఒకపక్క నగర ప్రజలపై ఆస్తి, చెత్త పన్నుల పేరుతో భారాల మోపుతూ, కార్పొరేటర్లకు గిఫ్ట్ కూపన్లు జారీ చేయడమంటే ప్రజాధనాన్ని కొల్లగొట్టడమేనన్నారు. గిఫ్టుల సంస్కృతికి తాను, తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన చర్యలపై చీఫ్ ఎలెక్టోలర్ అధికారి కార్యాలయ అధికారులు బుధవారం అన్ని జిల్లాల డిఆర్ఒలకు, పోలింగ్ సిబ్బందికి, శిక్షణ ఇచ్చు మాస్టర్ ట్రైనర్లకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు నష్టం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల రిజర్వేషన్లు లేకుండా పోతాయని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయిటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 686వ రోజుకు చేరుకున్నాయి. ఈ రోజు దీక్షల్లో వాటర్ వర్క్స్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉన్నందున రిజర్వేషన్లు వర్తించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వంటి అణగారిన తరగతుల వారికి ఉపాధి లభించిందన్నారు. అటువంటి స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ దీక్షల్లో సూరిబాబు, త్రినాథ్, ప్రకాష్, అనీల్, వాసు, గంగాధర్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు అభి, అనీల్, లక్ష్మణ్, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన సెంట్రల్ వాటర్ కమిషన్ టీమ్

జివిఎంసి కమిషనర్‌తో చర్చిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ టీమ్ సభ్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసిలో చేపడుతున్న తాగునీరు, భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ, మురుగు నీటి శుద్ధి తదితరాల పనితీరును పరిశీలించేందుకు నగరానికి విచ్చేసిన సెంట్రల్ వాటర్ కమిషన్ టీమ్ బుధవారం జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబును కలిశారు. ఈ సందర్భంగా సెంట్రల్ వాటర్ బోర్డు కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రిప్రసాద్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సైంటిస్ట్ నీలిమా పాటితో భేటీ అయి తాగునీరు సరఫరా, భూగర్భ డ్రెయినేజీ, మురుగునీటి శుద్ధి విధానాన్ని వారికి కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌కు సన్మానం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కింగ్ జార్జ్ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన సేవలు మరింతగా అందించాలని నేవల్ డాక్ యార్డ్ కెటిబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కోరారు. బుధవారం కెజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను అసోసియేషన్ సభ్యుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, డాక్టర్ అశోక్ కుమార్ సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రోగులకు సేవలు, వసతి సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న కెటిబి అసోసియేషన్ ప్రతినిధులు

అప్పన్న దేవస్థానంలో అభివృద్ధి పనులకు వినతి

ప్రహ్లాద కల్యాణ మండపం స్వాధీనం చేసుకోవాలి : గంట్ల

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుజాతకు వినతి పత్రం అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సింహాచలం దేవస్థానం పరిధిలో పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు కోరారు. బుధవారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాతను కలిసి వినతి పత్రం అందజేశారు. అనేక అభివృద్ధి పనులు జాప్యం జరగడం వల్ల అంచనాలు పెరిగి, వ్యయం దాటుతోందని, వీలైనంత త్వరగా ప్రారంభోత్సవం చేసి భక్తులకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. జగదాంబ జంక్షన్ సమీపంలో సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రహ్లాద కల్యాణ మండపం సుదీర్ఘ కాలం నుంచి (2019 ఏప్రిల్ 22 నుంచి) సిఆర్‌పిఎఫ్ ఆధీనంలో ఉందని, నాటి నుంచి సుమారు రూ.6.22 కోట్లు దేవస్థానానికి అద్దె రూపంలో బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రహ్లాద కల్యాణ మండపం స్వాధీనానికి ప్రస్తుత ధర్మకర్తల మండలి తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఆనందపురం జాతీయ రహదారి మీదుగా సింహాచలం దేవస్థానం చేరుకునే భక్తుల కోసం సత్తరువు జంక్షన్ వద్ద ముఖద్వారం ఏర్పాటుచేయాలని, పైడితల్లి అమ్మవారి ఆలయానికి రూ.50 లక్షలు మంజూరు చేసి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, కొండ దిగువున శ్రీనివాసనగర్‌లో కల్యాణ మండపాలు, వివిధ సముదాయాలను తక్షణమే భక్తులకు అందుబాటులోకి తేవాలని, పుష్కరణి సత్రం ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేయాలని విజ్ఞప్తిచేశారు.

కోడ్ ఉల్లంఘనపై దర్యాప్తునకు ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జివిఎంసి కమిషనర్ కొన్ని అభివద్ధి పనులకు టెండర్లు, వర్క్ ఆర్డర్లు ఇచ్చి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు వచ్చిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తక్షణం దర్యాప్తు జరిపి నివేదిక పంపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం ఈమెయిల్ ద్వారా తాను చేసిన ఫిర్యాదుపై ముఖేష్ కుమార్ మీనా స్పందించినట్లు 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు.

ముస్లిముల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి : నజీర్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముస్లిముల భూములు జిల్లాలో ఎన్ని ఎకరాలు ఉన్నాయెూ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ మదీనా దర్గా భూములని గెజిట్‌లో పొందుపరిచిన ఘనత చంద్రబాబుదన్నారు. ముస్లిములకు ఉన్న మొత్తం 7,600 ఎకరాల్లో ఎన్ని మిగిలాయెూ వెల్లడించాలని డిమాండ్‌చేశారు. 22 ఎ లో ఉన్న వక్ఫ్ భూములను అమ్మేయాలని ప్రభుత్వంలో కొందరు చూస్తున్నారని ఆరోపించారు. వాటిని కొనుక్కున్న వారు మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్‌కు ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వక్ఫ్ బోర్డు భూములపై వ్యాపారాలు సాగిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు తప్పవన్నారు. ఈ సమావేశంలో నాయకులు జఫురుల్లహ, మహమ్మద్ గౌస్, కాలేషా, మహమ్మద్ ఇలియాస్, షేక్ యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన ఎస్‌సి పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వైసిపి ప్రభుత్వం గత మూడేళ్లుగా రద్దు చేసిన 26 ఎస్‌సి పథకాలను వెంటనే అమలు చేయాలని బిజెపి ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షులు కోడూరి సంజీవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్‌సి యువతకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు ఎలాంటి ష్యూరిటీ లేని రుణాలు ఇప్పించాలని, ఎస్‌సి కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తోపుడు బళ్ల తరలింపు అడ్డగింత

- రోడ్డుపైనే బైఠాయించి చిరు వ్యాపారుల నిరసన
- బాసటగా నిలిచిన టిడిపి, సిపిఎం నాయకులు

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులో ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల దుకాణాలు, తోపుడు బళ్లను తొలగించాలన్న జివిఎంసి అధికారుల యత్నాలను చిరు వ్యాపారులు అడ్డుకున్నారు. ఎంతో కాలంగాఐస్ క్రీం, మురీ మిక్చర్, జొన్న పొత్తులు, నూడిల్స్, వేరుశెనగ కాయల అమ్మకం వంటి సంచార వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారుల తోపుడుబళ్ల తోపాటు శాశ్వతంగా ఏర్పాటు చేసిన కొన్ని బడ్డీలను సైతం తొలగించాలని జివిఎంసి ఒకటో జోన్ అధికారులు యత్నించారు. దీన్ని అడ్డుకున్న వ్యాపారులు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సిపిఎం జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి సంఘీభావం తెలిపారు. అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. జెడ్‌సి బొడ్డేపల్లి రాము ఆదేశాలతో పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, యుసిడి, ఎపిడి ఎల్ రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ బి మహాలక్ష్మి నాయుడుతో కూడిన జివిఎంసి బృందం బీచ్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని తోపుడు బళ్లను దూరంగా తరలించారు. మరికొన్నింటిని తరలించేందుకు అధికారులు చేసే ప్రయత్నాలను చిరు వ్యాపారులు తీవ్రంగా అడ్డుకుని, తీవ్రంగా ప్రతిఘటించారు. రోడ్డుపైనే బైఠాయించి ఆందోళనకు దిగడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తరలింపును తాత్కాలికంగా నిలుపుదల చేశారు. బీచ్‌రోడ్డులో శాశ్వతంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా కట్ చేసేందుకు సంబంధిత సిబ్బందిని వెంటబెట్టుకుని వచ్చారంటే ఎంత ముందస్తు ప్రణాళికతో అధికారులు వచ్చారో స్పష్టమౌతోందని వ్యాపారులు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధిని దెబ్బ తీయొద్దు

ఎన్నాళ్లగానో ఉన్న తోపుడు బళ్లు, దుకాణాలను తొలగించడం ద్వారా చిరువ్యాపారుల ఉపాధిని దెబ్బతీయొద్దని టిడిపి, సిపిఎం నేతలు గంటా నూకరాజు, మూర్తి కోరారు. ఈ మేరకు జెడ్‌సి బొడ్డేపల్లి రామును ఆయన చాంబర్‌లో కలిసి కొత్త సమస్య సృష్టించవద్దని విన్నవించారు దీనిపై జెడ్‌సి స్పందిస్తూ వెండింగ్ జోన్‌ను ఏర్పాటుచేసి నిర్ధేశిత ప్రదేశంలో వీటిని ఉంచాలన్నదే ప్రయత్నమన్నారు.సమస్యను మీరే సృష్టిస్తున్నారంటూ సిపిఎం, టిడిపి నేతలకు ఎదురు బదులిచ్చారు.

జి20 సదస్సు నేపథ్యంలోనే తొలగింపులా..?

విశాఖ కేంద్రంగా వచ్చేనెల 3 ,4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, 28,29 తేదీల్లో జి20 సన్నాహక సదస్సు జరగనన్న నేపథ్యంలో తోపుడుబళ్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు విషయాన్ని పక్కనబెట్టి బీచ్ సుందరీకరణ, వెండింగ్ జోన్ అంటూ కొత్త భాష్యాలు చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

పొట్ట కొట్టొద్దు

తోపుడుబండిపై జొన్నపొత్తులు అమ్ముకుంటూ బీచ్‌లో దాదాపు ఇరవై ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాను. ఉన్నఫలానా పొమ్మంటే ఎలా బతికేది? ఎక్కడి వెళ్లేది? పొట్టకొట్టే చర్యలు ఆపాలి. జి.కళావతి,చిరు వ్యాపారి

ఎలా బతికేది?

బీచ్‌రోడ్డులో దాదాపు 17ఏళ్లుగా వేరుశనగ కాయలు అమ్ముకుని బతుకుతున్నాను. ఇపుడు దాన్ని లేకుండా చేస్తే ఎలా బతకాలి? మాలాంటి పేదలకు అన్యాయం చేయొద్దు. కె లక్ష్మి, చిరు వ్యాపారి

నేరాలు ఘోరాలు

ఆటో ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నరిశంగబిల్లి జాతీయ రహదారిపై ఆటో ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న రోలుగుంట మండలం నిండిగొండకు చెందిన జిల్లేడుపూడి దినేష్ (18), కశింకోట గ్రామం బజారు వీధికి చెందిన కాకర మహాలక్ష్మి, నర్సీపట్నం మండలం వేములుపూడికి చెందిన గవిరెడ్డి వేమనాయడు నరిశంగబిల్లి 11 కెవి సబ్ స్టేషన్‌లో ఇంటర్న్‌షిప్ కోసం బుధవారం వచ్చారు. అనంతరం సాయంత్రం జాతీయ రహదారిపై బస్సు కోసం వేచి ఉండగా, యలమంచిలి నుండి అనకాపల్లి వైపు వస్తున్న ఆటో వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో జిల్లేడుపూడి దినేష్ అక్కడ అక్కడ మృతి చెందాడు. కాకర మహాలక్ష్మి, గవిరెడ్డి వేమనాయడు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్, ప్రయాణికురాలకు గాయాలయ్యాయి. వీరిని అనకాపల్లి ఎన్‌ఆర్‌టి వైద్యాలయానికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే మహాలక్ష్మి, వేమనాయడుకు తీవ్ర గాయాలు కావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. దినేష్ మృత దేహాన్ని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ రవి కుమార్ పరిశీలించారు. ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో పూల వ్యాపారి దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పూల వ్యాపారి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, శెట్టి గునకాం గ్రామానికి చెందిన బవిరిసెట్టి రామకృష్ణ (37) టివిఎస్ వాహనంపై ఆనందపురం పూల మార్కెట్‌కు పూలు అమ్మేందుకు వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో టివిఎస్‌పై ఉన్న రామకృష్ణ తీవ్రగాయాలపాలై సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. దీనిపై భీమిలి ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి టీ షాపు యజమాని మృత్యువాత

ప్రజాశక్తి-పద్మనాభం : వీధి కుక్కలు అడ్డంగా రావడంతో ఆటో బోల్తా పడిన ఘటనలో టీ షాపు యజమాని మృత్యువాత పడిన బుధవారం ఉదయం చోటుచేసుకుంది.. స్థానిక సిఐ సన్యాసినాయుడు చెప్పిన వివరాల ప్రకారం, ఆనందపురం మండలం, బోని గ్రామానికి చెందిన కనకల రాంబాబు(45) తగరపువలసలో టీదుకాణం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం బోని నుంచి రేవిడి వరకు సైకిలుపై వచ్చి, అక్కడి నుంచి ఆటోలో తగరపువలస చేరుకుని, ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు టీ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఎప్పటిలాగానే బుధవారం ఉదయం రేవిడి నుంచి తగరపువలస ఆటోలో వెళు తుండగా, కుక్కలు అడ్డంగా రావడంతో ఆటోకు సడన్ బ్రేక్ వేయడంతో అది బోల్తా పడింది. ఈ ప్రమాదంతో తలకు బలమైన గాయమైన రాంబాబు మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య కామేశ్వరి, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఇంటిపెద్దదిక్కు మరణంతో ఆ కుటుంబం జీవనోపాధి కోల్పోయి అనాథలుగా మారారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస: గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను భీమిలి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సిఐ కె.లక్ష్మణమూర్తి కథనం ప్రకారం...అందిన సమాచారం ప్రకారం సిఐ కె లక్ష్మణమూర్తి, తన సిబ్బందితో సంగివలస దివీస్‌పార్కు వద్దకు వెళ్లగా, గంజాయి విక్రయించేందుకు అక్కడే ఉన్న భీమిలి మండలం, తాటితూరు, ఎస్‌సి కాలనీకి చెందిన రౌడీషీటర్ పతివాడ వినోద్ కుమార్,భీమిలి, బ్యాంక్‌కాలనీకి చెందిన పోతాబత్తుల వెంకటేష్ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సిఐ కె లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

టోర్నీని ప్రారంభిస్తున్న బద్రీనాథ్

ప్రజాశక్తి-ములగాడ : యువత క్రీడల్లో రాణించాలని వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం 40వ వార్డు సింధియా న్యూకాలనీ గాంధీగ్రాం క్రీడా మైదానంలో జిఆర్‌కె యూత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా మరిడిమాంబ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మనసు ప్రశాంతతో పాటు ఎంతో ఉల్లాసంగా ఉండేదన్నారు. ఏ క్రీడలోనైనా రాణిస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈనెల 18న, మహాశివరాత్రి రోజున ఫైనల్ మ్యాచ్‌కు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు శరగడం సతీష్, హరీష్, రాజబాబు, తేజ, సాయి, వార్డు కార్పొరేటర్ గుండప్ప నాగేశ్వరరావు, పివి.సురేష్, 63వ వార్డు అధ్యక్షులు పెళ్ళికి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు,

50ఏళ్లు నిండిన చేనేతలకు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి -తగరపువలస : 50 ఏళ్లుపై బడిన చేనేత కార్మికులకు పింఛను సదుపాయం కల్పించాలని చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దర్జీలుగా ఉన్న చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని కోరారు . టైలర్ వత్తి వలన 45 ఏళ్లకే దష్టి లోపం వస్తున్నందున నేత్ర వైద్య పరీక్షలు ఉచితంగా జరిపించి, కళ్ళజోళ్లు అవసరమైతే వైద్యసాయం అందించాలని కోరారు. జగనన్న నేతన్న నేస్తం పథకాన్ని అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని కోరారు.

నేడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి-పద్మనాభం:మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో రామలింగేశ్వరాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణానికి బుధవారం పెళ్లిరాట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే స్వామి కల్యాణాన్ని గురవారం గ్రామపెద్దలు, భక్తులు సమక్షంలో నిర్వహించనున్నారు.

తుక్కు విక్రయాల్లో అవకతవకలపై

సమగ్ర విచారణ

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఎండీ కుమార్‌రాజా

పరిశీలిస్తున్న ఎండీ కుమార్‌రాజా

ప్రజాశక్తి -పిఎం పాలెం: బక్కన్నపాలెం సమీపంలోని ఎపి విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ(ఐటిఐ శిక్షణ ఉత్పత్తి కేంద్రం)లో తుక్కు విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపైనా చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎ.కుమార్‌రాజా స్పష్టం చేశారు. బుధవారం కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కేంద్రంలోని తుక్కు విక్రయాల్లో అవకతవకల్లో ప్రధాన కీలక పాత్ర పోషించిన ప్రిన్సిపల్ అబద్దాన్ని సస్పెండ్ చేయగా, తాజాగా మంగళవారం సాయంత్రం మరో ఇద్దరు అధికారులు, ప్రాజెక్టు ఆఫీసర్ వి.విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ పివి రమణమూర్తిలను సస్పెండ్ చేశారు.

ఈ నేపథ్యంలో కేంద్రం పరిశీలనకు వచ్చిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్‌రాజా మాట్లాడుతూ తుక్కు విక్రయానికి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురితో కమిటీ వేశామన్నారు. కానీ కమిటీలోని సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా తుక్కు విక్రయించారని ఆరోపణలు రావడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేశామన్నారు. దీనిపై సమగ్ర విచారణకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సుబ్బారెడ్డిని విచారణ అధికారిగా నియమించామన్నారు. తుక్కుతోపాటు సంస్థ ప్రాంగణంలోని భారీ వక్షాలు నరికివేతలోనూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉద్యానవన, అటవీశాఖ అధికారులను సంయుక్త విచారణకు బృందాలను నియమించా మన్నారు. సంస్థలో అక్రమాలపై విచారణకు జిల్లాస్థాయి అధికారులను నియమించినప్పటికీ, దీనిపై సమగ్ర పర్యవేక్షణకు ప్రధాన కార్యాలయం నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చానని ఎండీ కుమార్‌రాజా వెల్లడించారు. ఈ సందర్భంగా ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థుల వసతి, భోజన ఏర్పాట్లను పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో

ఉక్కు ఉద్యోగి మోహన్ ప్రతిభ

పతకాన్ని అందుకుంటున్న మోహన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాతీయస్థాయిలో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మూడు పతకాలను సాధించడం ద్వారా విశాఖ ఉక్కు ఉద్యోగి శిరపనశెట్టి మోహన్ సత్తా చాటారు. పశ్చిమబెంగాల్‌లోని కొల్‌కతాలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్‌లో 800, 400, 200 మీటర్ల పరుగుపందెం మూడు విభాగాల్లోనూ కాంస్య పతకాలను సాధించాడు. 16 రాష్ట్రాలకు చెందిన దాదాపు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విశాఖ స్టీల్ పేరు మార్మోగిపోయేలా చేశారు. కణితి గవర వీధికి చెందిన శిరపనశెట్టి మోహన్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కోకో ఓవెన్ విభాగంలో సిఎస్‌పి -3 టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు.

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌తో సత్తాచాటి మూడు కాంస్య పతకాలను సాధించడంతోపాటు జూన్, జూలై నెలలో శ్రీలంకలో జరగబోయే ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు అర్హత సాధించిన మోహన్‌ను ఉక్కుఉద్యోగులతోపాటు తోటి క్రీడాకారులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు అయోధ్యరాం, అధ్యక్షులు వైటి దాసు, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి ఇతర యూనియన్ నేతలు అభినందించారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ విజయానికి ఐద్వా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆరిలోవ కాలనీ, శ్రీలీలాసుందరయ్యనగర్‌లో పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను పంచుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. ఆరిలోవ ఐద్వా నాయకులు బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ, కాంతం, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపురంలో 'ఇదేమి ఖర్మ'

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని తునివలస పంచాయతీ నర్సాపురం గ్రామంలో బుధవారం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజుబాబు, ఇతర టిడిపి నేతలు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, అకృత్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తేనే రాష్ట్రానికి మనుగడ ఉంటుందన్నారు.అరాచక పాలన సాగిస్తున్న వైసిపికి గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన పొద్దుటూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం పొద్దుటూరు ఎమ్మెల్యే శివ ప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

దయారామ్ స్వీట్స్, బేకరీ ప్రారంభం

ఆహూతులను స్వాగతిస్తున్న బేకరీ యజమాని

ప్రజాశక్తి- విశాఖపట్నం : సీతమ్మధార సమీపంలో దయారామ్ స్వీట్స్ బేకరీ బుధవారం కొత్తగాప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ యజమాని రాజేష్ మాట్లాడుతూ, అన్ని రకాల వేడుకలకు, నిత్య వాడకానికి వీలుగా నాణ్యత, స్వచ్ఛమైన రుచులతో అన్ని రకాలస్వీట్స్, హోమ్ ఫుడ్స్,. బిస్కెట్స్. తమ దుకాణంలో లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఆహూతులను బేకరీ యజమాని పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు

యాపిల్ కిడ్స్ ప్రీస్కూల్ ప్రారంభం

ప్రీస్కూల్ ప్రారంభోత్సవంలో రాజకీయ నేతలు

ప్రజాశక్తి -మాధవధార : 50వ వార్డు మాధవధారలో యాపిల్ కిడ్స్ ప్రీస్కూల్‌ను స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ ఆర్ వెంకటరమణ, వైసిపి మహిళా నేత పేడాడ రమణికుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రీస్కూల్‌లో పిల్లలను చేర్పించడం ద్వారా వారిలో క్రమశిక్షణను అలవరిచి, రెగ్యులర్ స్కూల్‌కు సన్నద్ధత చేసే వీలుంటుందన్నారు. యాపిల్ కిడ్స్ ప్రీస్కూల్ చిన్నపిల్లలను తీర్చిదిద్దడం ద్వారా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఎన్ని సంధ్యారాణి, ఎన్ని శ్రీవిద్య, ప్రముఖ న్యాయవాది సనపల నరసింహస్వామి, సనపల నారాయణస్వామి, పూజారి ఉదయ్‌కుమార్, పొన్నాడ అప్పారావు, 50వ వార్డు బిజెపి అధ్యక్షురాలు తమ్మినేని పద్మజ పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన

కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మునిస్వామి

ప్రజాశక్తి- విశాఖపట్నం : వెట్టిచాకిరి నిర్మూలనపై సర్కిల్-2 సహాయ కార్మిక కమిషనర్ బుద్ధ మునిస్వామి ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోపాలపట్నం, కరాస, సుజాతనగర్, పెందుర్తి ప్రాంతాల్లో సహాయ కార్మిక అధికారులు పి.విజయకుమార్, ఎం.పద్మావతితోపాటు గోపాలపట్నం పోలీసులతో కలిసి బృందంగా వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ, వెట్టిచాకిరి కార్మిక సంబంధమైనదే కాకుండా తీవ్రమైన మానవ ఉల్లంఘన నేరంగా పరిగణించి, చట్టపరంగా కేసులు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. 1976 వెట్టిచాకిరి నిర్మూలన చట్టం ప్రకారం కారణమేదైనా వ్యక్తులతో బలవంతంగా పనిచేయించడం, శారీరక, మానసిక హింసకు గురిచేయడం, ఇష్టమైన చోటుకు వెళ్లి, ఇష్టమైన పనిని చేసుకునే హక్కును హరించడం, చట్టబద్ధంగా కనీస వేతనం చెల్లించకపోవడం వంటివన్నీ వెట్టిచాకిరి కిందే వస్తాయని వివరించారు. దీనికి చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరి లేని రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ హెచ్‌సిలు వెంకటరావు, ఎం.శ్రీనివాస్, ఇతర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యతపై అవగాహన అవసరం

ఆవిష్కార్-2023 సదస్సులో ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ డాక్టర్ అనిల్‌కుమార్

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : విద్యార్థులు కాలేజీ దశ నుంచే సాంకేతిక నైపుణ్యతపై ప్రత్యేక అవగాహన పెంపొందించుకోవాలని ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ డాక్టర్ టి.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం రుషికొండ గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ అటానమస్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన ఆవిష్కార్-2023ను ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సులో మాట్లాడుతూ, ఇన్నోవేషన్ ప్రాధాన్యత, ఇన్నోవేషన్ వాలీ చేస్తోన్న కార్యక్రమాలు, గ్లోబల్ సమ్మిట్ విషయాలను వివరించారు
పేటెంట్, ఇన్నోవేషన్ ప్రాముఖ్యతను గౌరవ అతిథి డాక్టర్ బి.కె..సాహూ వివరించారు. కార్యక్రమలో గాయత్రీ విద్యా పరిషత్ జాయింట్ సెక్రటరీ డి.కామేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రజని, సిఎస్‌ఈ. విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వి.రమణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ బివి.రమణమూర్తి పాల్గొన్నారు. మూడు రోజుల సదస్సులో కార్యక్రమాల వివరాలను జి. కల్యాణచక్రవర్తి వివరించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాపరిషత్ అటానమస్ కాలేజీ, ఎంపి ఇన్నోవేషన్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

'పుల్వామా' వీర జవాన్లకు ఘననివాళి

ర్యాలీ నిర్వహిస్తున్న జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి -ఆనందపురం: జమ్ము కాశ్మీర్ పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లర్పిస్తూ ఆనందపురం జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడిలో 40 మంది అమరులయ్యారు. దీనికి సంతాపంగా ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆనందపురం ఎస్ఐ నరసింహమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్, జై జవాన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కుప్ప రాజశేఖర్, సెక్రెటరీ ముడసల కార్తీక్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, ట్రెజరర్ కుప్ప రామలక్ష్మి, ఇమంది శ్రీనివాస్, కుప్ప దుర్గారావు, కుప్ప శ్రీను, వాసు, సాయిరాం, విష్ణు సంతోష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

ప్రజాశక్తి-వేపగుంట : 93వ వార్డు ప్రహ్లాదపురంలో ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేరుచేసి, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో జివిఎంసికి ఒకటోర్యాంకు వచ్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని, నార, గుడ్డ సంచులనే ప్రతిఒక్కరూ వాడాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా, శానిటరీ సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

లీప్ ప్రోగ్రాం అమలు తీరుపై పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను లిప్ రాష్ట్ర పరిశీలకులు ఎన్ తిరుపతినాయుడు బుధవారం సందర్శించారు. లీప్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. లిప్ పద్ధతిలోప్లాన్స్, విద్యార్థులు ఏ మేరకు రాసినదీ చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బోనిలో 'పొలంబడి'

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బోని పంచాయతీలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.అనకాపల్లి ప్రాంతీయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తల బృందం పాల్గొని వరిపైర్లను పరిశీలించారు. పొటాష్ లోపాన్ని గుర్తించి, తగు సస్యరక్షణ సూచనలు చేశారు. జీవన ఎరువుల ప్రాముఖ్యత వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ విశాలాక్షి ,డాక్టర్ గౌరీకుమారి, డాక్టర్ శిరీష, జిల్లావ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఎడిఎ సిహెచ్. సుబ్రహ్మణ్యం, జిల్లావనరుల కేంద్రం ఎఒ నాయక్, ఆనందపురం ఎఒ సంధ్య రత్నపభ పాల్గొన్నారు.

కొనసాగిన హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- సింహాచలం: సింహది అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపును బుధవారం రెండో రోజు కూడా చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ సుజాత పర్యవేక్షణలో మిగిలిన హుండీలను తెరిచి లెక్కించగా రూ.65,47,436 నగదు, 30.200 గ్రాముల బంగారం, 4.485 కేజీల వెండి, వివిధ దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రెండు రోజుల లెక్కింపుతో సింహాద్రి అప్పన్నకు భక్తులు రూ.2.61కోట్ల నగదును కానుకల రూపంలో సమర్పించారు.

బుద్ధుని విగ్రహం సరిచేసేందుకు యత్నం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు, లైట్ హౌస్ సమీపంలోని బుద్ధుని విగ్రహం సరి చేసేందుకు ఎట్టకేలకు జివిఎంసి అధికారులు పూనుకున్నారు. 'జి20 సదస్సుతోనైనా భీమిలి రూపురేఖలు మారేనా?'శీర్షికన ఈనెల 11న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం టెలిస్కోప్ లిఫ్టర్ అనే క్రేన్‌ను తీసుకొచ్చి బుద్ధుని విగ్రహం సరి చేసేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. విగ్రహం చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్, కింద మట్టం ఒరిగిపోయి ఉన్న నేపథ్యంలో అదే స్థలంలో యథావిధిగా విగ్రహం ఉంచుతారా? లేదా వేరే ప్రదేశానికి తరలిస్తారా? అనేది తెలియాల్సి ఉంది.జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, యుసిడి, ఎపిడి, ఎల్ రాము, ఎఇ ఎ.సుమన్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు

జగనన్న ఇళ్లకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు కేటాయించాలని, రూ.25 వేల నుంచి రూ.లక్ష కట్టిన టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను కేటాయించాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో ఆరిలోవ, భగత్‌సింగ్‌నగర్‌లో సిపిఐ నేతలు ఎస్.కె.రెహ్మాన్, ఎ.విమల ఆధ్వర్యంలోఇంటింటికి వెళ్ళి కరపత్రాల పంపిణీ చేసారు. మార్చి 2న జరగబోవు మహా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కె.రమణ, కాసుబాబు, శ్రీనివాస్, నూకరాజు పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చిరంజీవిరావును గెలపించాలని కోరుతూ బుధవారం 9, 10, 12, 13 వార్డుల పరిధిలో ఆపార్టీ శ్రేణులు వేర్వేరుగా కరపత్రాలను విస్తృత ప్రచారం నిర్వహించాయి. కార్యక్రమంలో టిడిపి నేతలు బుడుమూరు గోవిందు, బాదరు బాలరాజు, ఒమ్మి అప్పలరాజు, మద్దిల రాజశేఖర్, గాడి సత్యం, ముగడ రాజారావు, గాడు అప్పలనాయుడు, కేత సత్యనారాయణ, బాలస్వామి, సోనాపురం సుధాకర్, వడిసెల శ్రీను పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల సమావేశం

ప్రజాశక్తి -తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ము త్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు పి బాలరాజు పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ పాల్గొన్నారు

అభిమాని కుటుంబానికి అల్లు అర్జున్ ఆర్మీ అండ

సాయం అందజేస్తున్న అల్లు అర్జున్ ఆర్మీ ప్రతినిధులు

ప్రజాశక్తి -కంచరపాలెం : విద్యుదాఘాతంతో మృతి చెందిన విశాఖకు చెందిన అల్లు అర్జున్ అభిమాని సురేష్ కుటుంబానికి అల్లు అర్జున్ ఆర్మీ బృందాలు అండగా నిలిచాయి. సమాచారం తెలిసిన వెంటనే హుటాహుటిన అభిమాని సురేష్ ఇంటికి చేరుకుని, అంతిమ సంస్కారాలకు అవసరమైన ఏర్పాట్లు చేసి దగ్గరుండి కార్యక్రమం పూర్తి చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలన్న ఉద్దేశ్యంతో అన్ని టీమ్స్ నుంచి సేకరించిన రూ.70వేలుతోపాటు, సినీ నిర్మాత ఎస్‌కెఎన్ సమకూర్చిన రూ.25వేలు కలుపుకుని మొత్తం రూ.95వేల ఆర్థికసాయాన్ని సురేష్ కుటుంబానికి వైజాగ్ టీం లీడర్ విజయ్ అందజేశారు. కాగా వైజాగ్‌తోపాటు ఆంధ్రా, తెలంగాణకు చెందిన అల్లుఅర్జున్ ఆర్మీ టీమ్‌లు కూడా బాధిత కుటుంబానికి అండగా నిలిచాయి.

ల్యాండ్ ఫూల్‌ంగ్

పెద ముషిడివాడలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు

- పట్టణ పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల సమీకరణ
- భూముల కోల్పోయిన వారికి నాడిచ్చిన హామీలు గాలికి
- నేటికీ అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించని వైనం
- ఐదు రోజులుగా బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-పరవాడ

పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం బాధిత దళిత, వెనుకబడిన తరగతుల పేదలను ఫూల్ చేసింది. తోటలు, పంటలు సాగుచేసుకొని హాయిగా జీవిస్తున్న పేదల నుంచి బలవంతంగా భూములను లాక్కొని, నాడు వారికి ఇస్తామన్న అభివృద్ధి చేసిన ప్లాట్లు నేటికీ ఇవ్వలేదు. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నారు.

ఆందోళన చేస్తున్న భూములు కోల్పోయిన రైతులు

పరవాడ మండలం పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలోని దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన పేదలకు గతంలో ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టా భూములను ఇచ్చింది. వీరు ఈ భూములను సాగు చేసుకొని జీవనోపాధి పొందేవారు. మరికొంత మంది పేదలు ప్రభుత్వ భూములను సాగుచేసుకొని జీవనం సాగించేవారు. వైసిపి ప్రభుత్వం 2019-20 సంవత్సరంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కోసం ల్యాండ్ పూలింగ్ పేరుతో దళిత, వెనుకబడిన తరగతుల పేదలకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకుంది. ఈ విధంగా పెదముషిడివాడ రెవెన్యూలో 13, 63, 76, 367, 432, 450 సర్వే నెంబర్లలో 300 ఎకరాల పైనే భూమిని తీసుకుంది. వీటిలో 200 మంది దళితులకు చెందిన 260 ఎకరాలు, 75 మంది వెనుకబడిన తరగతులకు చెందిన 40 ఎకరాలు, మరో 30 ఎకరాలు మాజీ సైనికుల భూములు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ భూములకు నష్టపరిహారం చెల్లించకుండా ఎకరానికి డి.పట్టా ఉన్నవారికి 900 గజాలు, డి.పట్టా లేకుండా సాగులో ఉన్న వారికి 450 గజాలు చొప్పున భూమిని అభివృద్ధి చేసి, వుడా అప్రూవల్‌తో రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు ఇస్తామని 2019-20 సంవత్సరంలో ప్రభుత్వం తరపున నాటి అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఇలా తీసుకున్న భూముల్లో ప్లాట్లు వేసి పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. కాని భూములిచ్చిన పేద దళిత, వెనుకబడిన తరగతుల రైతులకు నేటికీ ఇచ్చిన హామీ ప్రకారం ప్లాట్లు అప్పగించలేదు.

దీంతో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీల్లో చేస్తున్న నిర్మాణాలను బాధిత రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డి-పట్టా భూమి ఎకరానికి 900 గజాలు, సాగులో ఉన్నవారికి ఎకరానికి 450 గజాలు చొప్పున అభివృద్ధి చేసి, వుడా అప్రూవల్‌తో రిజిస్ట్రేషన్ చేసిన తర్వాతే జగనన్న ఇళ్ళ నిర్మాణం చేపట్టాలని, అంతవరకు పనులు చేయరాదని బాధిత రైతులు ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. భూ సమీకరణ సమయంలో అప్పటి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక వైపు రైతులకు ఇచ్చిన హామీను నెరవేర్చకపోగా, మరో వైపు పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీను నెరవేర్చే విధంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

త్వరలో పట్టాలిస్తాం : తహశీల్దారు

దీనిపై పరవాడ తహశీల్దార్ వి.ప్రకాశరావును ప్రజాశక్తి వివరణ కోరగా పెదముషిడివాడ రెవెన్యూలో ప్రభుత్వం సేకరించిన ల్యాండ్ పూలింగ్‌లో 133 మంది రైతులను అర్హులుగా గుర్తించామని, వారికి త్వరలోనే పట్టాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

బహుమతులు అందజేస్తున్న హెచ్‌సి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన వికాస పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బహుమతులు ప్రదానం చేశారు. పరీక్షలలో పి.తరుణ్ కుమార్, ఎల్ శ్రీనాథ్, ఎల్ ప్రసన్న ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణ, సుబ్బరాయ శర్మ, రామకృష్ణ తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె సోమనాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి గొర్లి తరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అజయ్‌రాజు

ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం

స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ జన్మదిన వేడుకలు సందర్భంగా నిర్వహిస్తున్న నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మండలంలోని రావలమ్మ పాలెంలో బుధవారం వైసిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకాలను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పిఏసీఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, బోను నాయుడు పాల్గొన్నారు.

సెపక్ తక్రా పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు

సెపక్ తక్రా క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లా సెపక్ తక్రా క్రీడలు దేవరాపల్లి మండలం పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. అండర్- 14, 17 విభాగానికి సంబంధించి సెలక్షన్ ట్రైల్స్‌ను హెచ్ఎం పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ క్రీడల్లో సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు ఈ నెల 19, 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే క్రీడల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ బి.కిరణ్ కుమార్, సెక్రెటరీ ఎ. శేఖర్, దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిడి టి.నాగేశ్వరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సిహెచ్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డును తరలించాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణ నడిబొడ్డున జీవీఎంసీ జోనల్ కార్యాలయాన్ని ఆనుకొని జనావాసాల మధ్య పదేళ్లుగా నిర్వహిస్తున్న కంపోస్టు యార్డ్‌ను తక్షణమే తరలించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కంపోస్టు యార్డు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ చెత్త డంపింగ్ తో పాటు మురికి కాలువల శిల్టును కూడా ఇక్కడే వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి అమర్నాథ్‌కు పలుమార్లు విన్నవించిన చర్యలు చేపట్టలేదన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న లాల్ కృష్ణ

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ఫార్మాసిటీ క్రీడా మైదానంలో పరవాడ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్మా సిటీ, రాంకీ ఫౌండేషన్ సంయుక్త సౌజన్యంతో ఏర్పాటు చేసిన రొంగలి కారు నాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఫార్మాసిటీ ఎమ్‌డి డాక్టర్ పిపి.లాల్‌కృష్ణ బుధవారం ప్రారంభించారు. ముందుగా సీనియర్ జర్నలిస్టు కారు నాయుడు, జేసాప్ వ్యవస్థాపక అధ్యక్షులు సోడిశెట్టి దుర్గారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు వారదులుగా ఉంటూ నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటారని తెలిపారు. జర్నలిస్టులు తమ ఆరోగ్య పరిరక్షణకు ఏదో ఒక క్రీడను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో జర్నలిస్టు క్రీడలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, పరవాడ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.లోకేష్, ఎండి.రాజు, జేశాప్ రాష్ట్ర కార్యదర్శి వాల్మీకి నాగరాజు, అనకాపల్లి, పరవాడ, పెందుర్తి, గాజువాక, గాజువాక జేశాప్, వైజాగ్ వెబ్ వారియర్స్, వెబ్ టైగర్స్ చెందిన క్రికెట్ జట్ల సభ్యులు, పరవాడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు నాయుడు కుటుంబానికి ఆర్థిక సాయం

కీర్తిశేషులు రొంగలి కారు నాయుడు కుటుంబానికి వసుధ, రక్షిత్ డ్రగ్స్, విష్ణు కెమికల్స్ తదితర ఫార్మా ప్రతినిధులు ఆర్థిక సహాయం అందించారు. ఆయా కంపెనీల ప్రతినిధులు దొర, కమలాకర్, హర్షవర్మ కారు నాయుడు సతీమణి విజయ లక్ష్మికి నగదును అందజేశారు.

రెండు కోటాల రేషన్ బియ్యం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా చౌక డిపోల ద్వారా ఇస్తున్న రెండు కోటాల రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు అందించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన బుధవారం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఏవో జయశ్రీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ కరోనా కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం ఇస్తుందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న బియ్యాన్ని ఆపేయడం దుర్మార్గమన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటిన నేపథ్యంలో రేషన్ డిపోల ద్వారా అందిస్తున్న బియ్యం పైనే పేదలు ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు, ముక్కామల సత్యనారాయణ, చిన్ని, మత్తుర్తి సూరిబాబు, జివి రావు పాల్గొన్నారు.

భయం లేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కశింకోట

విద్యార్థులు భయం లేకుండా తమ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో బుధవారం విజయమార్గానికి సోపానాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ నూతన ఉత్సాహాన్ని, ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు మార్గదర్శకాలు వివరించారు. ఈ సందర్భంగా యండమూరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, ప్రిన్సిపాల్ మహేష్, అకాడమిక్ ఇన్‌ఛార్జి రూపానంద, విద్యార్థులు పాల్గొన్నారు.

యండమూరిని సత్కరిస్తున్న సెయింట్ జాన్స్ స్కూల్ ప్రతినిధులు

నర్సింగరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వర్మ తదితరులు

నర్సింగరావు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండల పరిషత్తు మాజీ అధ్యక్షులు రాజాన నర్సింగరావు సేవలు సమాజానికి ఆదర్శనీయమని డిసిసిబి మాజీ ఛైర్మన్ యు.సుకుమార్ వర్మ అన్నారు. అచ్చుతాపురం పంచాయతీ కుమార్‌పురం గ్రామంలో నర్సింగరావు సంతాప సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్మ మాట్లాడుతూ నర్సింగరావు నీతి నిజాయితీతో పరిపాలన సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, రాజాన అప్పలకొండ, ధర్మ రెడ్డి నారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా, ప్రసవించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని పల్లపుకోడాబు గ్రామానికి చెందిన పోతుబోయిన దేవుడమ్మ బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా, ఆమెను 108 వాహనంలో హాస్పిటల్‌కి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈఎంటి పి.దేముళ్ళు చాకచక్యంగా వ్యవహరించి, సుఖ ప్రసవం చేశారు. తల్లి, బిడ్డను ఆరోగ్యంగా వేపాడ పిహెచ్‌సికి తరలించారు.

12 గ్రామాల్లో భూ సమగ్ర రీ సర్వే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో 12 గ్రామాల్లో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందని మండల తహశీల్దార్ వై శ్రీనివాసరావు తెలిపారు. మొదట విడతలో తిమ్మరాజుపేట, హరిపాలెం, పెదపాడు, కాజీపాలెం, జగన్నపేట, జిపి అగ్రహారం గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. మొదటి విడతలో గ్రామాలకు 374 పాస్ పుస్తకాలను సంబంధిత యజమానులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండో విడతలో కొండకర్ల, అందలా పల్లి, ఉప్పవరము, ఎం జగన్నాథపురం, ఆవ సోమవారం, జెపి అగ్రహారం గ్రామాల్లో సర్వే పనులు చేపట్టడం జరిగిందన్నారు. దశలవారీగా ప్రతి ఒక్కరికీ భూ సమగ్ర సర్వే కు సంబంధించిన పుస్తకాలు వస్తాయని ఆయన చెప్పారు.

47 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 100వ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఎంపికైన 47 మంది కంటి రోగులకు శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకొని బుధవారం తిరిగి వచ్చారు. హాస్పిటల్‌లో వారందరికీ ఆపరేషన్ చేసి తిరిగి బ్రాండిక్స్‌కు పంపించారు.

శివుని విగ్రహం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఆవరణలో నిర్మించిన శివుడు విగ్రహాన్ని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి బుధవారం ప్రారంభించారు. టీడీపీ నేత గండి రవి కుమార్ శివుని విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ విగ్రహ నిర్మాణానికి మాజీ సర్పంచ్ దాసరి వెంకట రమణ ఆర్థిక సహాయం అందించారు. గండివానిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి కనకరాజు ఇచ్చిన లక్షా 20 వేల రూపాయల ఆర్థిక సహాయంతో అమ్మవారి గుడిని రంగులతో సుందరంగా తీర్చి దిద్దారు. ఎంపీటీసీ సిరం అప్పలరాజు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, ఉప సర్పంచ్ రాపర్తి అరుణ ముత్యాలయుడు, కోన సత్యనారాయణ, గొంతిన పైడిరాజు, పాల్గొన్నారు.

శివుని విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బండారు

డిఎస్‌పి సునీల్‌పై విచారణ చేపట్టాలని నిరసన

ఎస్‌పి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి డిఎస్‌పి సునీల్‌పై డిఐజి, లేదా సిఐడితో విచారణ చేపట్టాలని కోరుతూ స్థానిక ఎస్పీ కార్యాలయం ముందు బుధవారం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్పీ గౌతమి శాలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ పోలీసులు గంజాయి రవాణా వాహనాలకు దొంగ నెంబరు ప్లేట్ మారిస్తే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో డిఎస్‌పి సునీల్ అవినీతిపై ఎస్పీకి నివేదించినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. గంజాయి అక్రమ రవాణాలో సీజ్ చేసిన వాహనాల్లో పోలీసులే తిరుగుతుంటే ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకుంటారన్నారు. ఇలాంటి ఘటనల వల్ల పోలీసులపై ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు. తక్షణమే అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని బాలాజీ, మాదంశెట్టి నీలబాబు, మల్ల సురేంద్ర, కాయల మురళి, సబ్బవరపు గణేష్, కొణతాల శ్రీనివాసరావు, తలారి కాశీనాయుడు, సిదిరెడ్డి సూర్య నారాయణ, ఎంఎస్ఎన్, అక్కిరెడ్డి రమణబాబు, ఆనాల తాతయ్య నాయుడు, కరణం రమణ, మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూమిని అప్పగించాలని వినతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

తన సాగులో ఉన్న భూమిని తనకు అప్పగించాలని మండలంలోని కరక గ్రామానికి చెందిన కొంగ అప్పారావు కుమారుడు శ్రీను బుధవారం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబుతో కలిసి డిప్యూటీ తహశీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తన తండ్రి కొంగ అప్పారావు 20 ఏళ్ల క్రితం నుండి సర్వే నెంబర్ 84-4లో సాగు చేసుకుంటున్న 2.12 ఎకరాల భూమికి ప్రభుత్వం 2014 ఫిబ్రవరి 4న తన తల్లి నాగమణి పేరున డి పట్టా మంజూరు చేసిందని తెలిపారు. నాటి నుండి నేటి వరకు సదరు భూమిని సాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం ఈ భూమికి గ్రామానికి చెందిన ఎన్నంశెట్టి దేవుడుకు డి.పట్టా మంజూరు చేస్తున్నట్లు, తమ యొక్క డి పట్టాను రద్దు చేస్తున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాము సాగు చేసిన సరుగుడ తోటను ఎన్నంశెట్టి దేముడు ధ్వంసం చేశారని, దీనిపై బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్లో 2022 డిసెంబర్ 24న ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. తమ పేరున డి పట్టా ఉన్న భూమికి రెవెన్యూ అధికారులు వేరే వ్యక్తులకు డి పట్టాను మంజూరు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. తమ సాగులో ఉన్న భూమిని తమకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, నాయకులు దొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో నిర్మాణాలపై చర్యలకు...

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం, వడ్డాదిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిలో చేస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు తదితరులు బుధవారం డిప్యూటీ తహశీల్దార్ మురళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ గ్రామ పెద్దలు దేవాలయ అవసరాల నిమిత్తం కొంత భూమిని కేటాయించారని, అందులో గతంలో ప్రభుత్వం నుండి పక్కా ఇల్లు లబ్ధి పొందిన గ్రామానికి చెందిన దువ్వాడ శంకరరావు ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారని తెలిపారు. ఉత్సవాలు తదితర అవసరాల నిమిత్తం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. దీనిపై దేవస్థానం అధికారులకు సైతం ఫిర్యాదు చేయగా, వారు కూడా తహశీల్దారుకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వడ్డాది గ్రామ అధ్యక్షులు దొండా నరేష్, నాయకులు కోరుకొండ గురుమూర్తి, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ఎక్కువ మంది ఉపాధి కూలీలతో పనులు చేయించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎక్కువమంది కూలీలతో పనులు చేయించాలని ఎంపీడీవో విజయలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథక ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 13 గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. 1320 మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రతి కూలి 90 దినాలు పనిచేయాలన్నారు. జగనన్న గృహకల్పనలో 400 గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో వై వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవపై సమీక్ష

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నేటి వరకు 16,576 మందితో ఈకేవైసీ చేయించడం జరిగిందని తెలిపారు. ఇంకా 23,278 మందికి ఈ కేవైసీ చేయించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ పరిపాలన అధికారి డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్‌ఛార్జి తహశీల్దారు శ్రీరామ్మూర్తి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం పలు గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై, ఆక్రమించుకున్న వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం భారతీయ శిక్షాస్మృతి 183, 189, 196 సెక్షన్ల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో అచ్చర్ల, మాసయ్యపేట గ్రామంలో చిరు ధాన్యాలు, 30 రకాలు విత్తనాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘం లీడర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఒ సీసీ సత్యనారాయణ, సిబ్బంది నాగమణి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

108వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 108వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. 108 రోజులుగా ధర్నా చేస్తున్నా జిల్లా అధికారుల్లో చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో శారద, వరాహ నదిలో వేటకు వెళ్లి జీవనాన్ని కొనసాగించే వాళ్ళమని, ఇప్పుడు నేవీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఉపాధి లేక రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు ఆధార్ ఆధారంగా నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

ప్రజాశక్తి- కశింకోట : రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి నిరంకుశ పాలనపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ప్రజలు ప్రశ్నించక పోతే జగన్ రెడ్డి ప్రజలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తీస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, నాయకులు షేక్ బబార్, చిదిరెడ్డి గీతా ప్రసాద్, చామంతుల శ్రీను, గుడువు చలపతి, కలగా సన్యాసి నాయుడు, సీరంశెట్టి వెంకట లక్ష్మి, చెట్టుబిల్లి అప్పల నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేన గెలుపునకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ గెలుపునకు రెల్లి కులస్తులు పని చేయాలని జనసేన నాయకులు డాక్టర్ కోన నారాయణరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర జనసేన రెల్లి సమితి ఆదేశాల మేరకు మండలంలోని తుమ్మపాల బంగార్రాజు కళ్యాణ మండపంలో రాష్ట్ర రెల్లి కమిటీ సభ్యులు కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో నారాయణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నుంచి సోమి ఉదయకుమార్, సోమి శంకర్రావు, తెనాలి నుంచి రాఘవేంద్ర, విజయవాడ నుంచి భూపతి రాజు, గిరి స్వామి, పార్వతీపురం నుంచి హరియాల సురేష్, విశాఖపట్నం నుంచి ఎర్రం శెట్టి సురేష్, బండి సురేంద్ర, రాజమండ్రి నుంచి వై వెంకటేశ్వరరావు, తుని నుంచి రాజు, చెల్లా బుజ్జి, శ్రీను పలు జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయానికి పైలా విరాళం

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని నాగయ్యపేట పంచాయతీ శివారు సీతమ్మపేట గ్రామంలో నూతనగా నిర్మించిన మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు రూ. 25వేలు విరాళంగా బుధవారం అందచేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కాన సింహాచలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు కర్రి నాయుడు, జంపాన సత్యం, సిరికి లక్ష్మి, పోతల దేముడమ్మ, కర్రి లక్ష్మి, జక్కాన సత్యనారాయణ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

-అభ్యాసనా సామర్థ్యం మెరుగుపరచాలి -రాష్ట్ర పర్యవేక్షణ బృందం సభ్యులు

ప్రజాశక్తి-నక్కపల్లి:విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యం మెరుగు పరచాలని రాష్ట్ర పర్యవేక్షణ బృందం ఉపాధ్యాయులకు సూచించింది. నక్కపల్లి బాలికోన్నత పాఠశాలను బుధవారం రాష్ట్ర పర్యవేక్షణ బృందం సభ్యులు జిజిఎస్ నాగేశ్వరరావు, వీవీఎస్ నాగలక్ష్మి, డేవిడ్ రాజు, నోడల్ అధికారి గిరి సందర్శించి, విద్యార్థుల్లో అభ్యాసనా మెరుగును పరిశీలించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్లు, డైరీలు, విద్యార్థుల నోటు పుస్తకాలు, నెలవారి ప్రగతి, విద్యార్థులు పొందిన గ్రేడ్లు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.అదనపు తరగతులు నిర్వహించి అభ్యాసనా స్థాయిని మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల స్థాయిని బట్టి ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. టీచింగ్ పీరియడ్‌తో పాటు ప్రాక్టీస్ పిరియడ్ ద్వారా విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు

విద్యార్థులను ప్రశ్నిస్తున్న బృందం సభ్యులు

.ఉపాధ్యాయులు ఎల్ఐపి శిక్షణ కార్యక్రమంలో సూచించిన విధంగా పాఠ్యప్రణాళికను సిద్ధ పరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం పుష్పరాగం పాల్గొన్నారు.

ఛేదించిన యువకుడి హత్య కేసు

నిందితుడిని ప్రవేశ పెట్టిన పోలీసులు

ప్రజాశక్తి- యస్.రాయవరం:మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురం సెంటర్ పెదగుమ్ములూరు ప్రభుత్వ వైన్ షాప్ వద్ద సోమవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందుతుడుని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు.పోలీసుల కథనం మేరకు... మండలంలోని కోరుప్రోలు గ్రామానికి చెందిన దంటు ప్రవీణ్ కుమార్ (23)ను అదే గ్రామానికి చెందిన చొప్పా రమణ పెదగుమ్ములూరు గ్రామం వద్ద గల ప్రభుత్వ వైన్ షాప్ వద్ద సోమవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేసి నిందుతుడు చొప్పా రమణను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు మాట్లాడుతూ, మృతుడు దంటు ప్రవీణ్ కుమార్ అదే గ్రామంలో కొబ్బరి పీచు మిల్లులో గుమస్తాగానూ, నిందితుడు చొప్పా రమణ అదే మిల్లులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో సన్నిహితంగా మెలిగేవారని, సుమారు ఒక సంవత్సరం క్రితం రమణ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను పలుమార్లు హెచ్చరించి నప్పటికి తీరు మార్చుకోలేదని, తన కుమార్తెకు పెళ్లి చేసి అత్తవారింటికి పంపించినప్పటికి వేధింపులు ఎక్కువ అయ్యాయని విచారణలో తెలిపాడన్నారు. రమణ భార్యకు లేని పోనివి చెప్పి కుటుంబంలో గొడవలు సృష్టించాడని, కూతురి జీవితాన్ని, తన కాపురాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రవీణ్‌కుమార్‌ను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసి వైన్ షాప్ వద్ద మాటు వేసి కత్తితో విచక్షణారహితంగా చంపి, హత్యకు ఉపయోగించిన కత్తిని సంఘటన స్థలంలో పడవేసి పారిపోయాడని తెలిపారు. నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో రిమాండ్‌కు తరలిస్తున్నామని

మాట్లాడుతున్న సిఐ నారాయణరావు

తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ ప్రసాదరావు, కోటవురట్ల ఎస్ఐ నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు

భూముల రీ సర్వే వేగవంతం

తహసీల్దార్ కనకారావు

ప్రజాశక్తి -కోటవురట్ల:రీ సర్వేను వేగవంతం చేయాలని నాతవరం మండల తహసీల్దార్ కనకారావు ఆదేశించారు. బుధవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఇంతవరకు నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తి కాగా మరో మూడు గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతుందన్నారు.సిబ్బంది గ్రామీణ ప్రాంత రైతులకు, భూ యజమానులను సమాచారం అందించాలన్నారు. అదే విధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ఎన్నికల నిబంధనలు పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 1588 పట్టభద్రులు ఓట్లు ఉన్నాయని, ఇందు నిమిత్తం మండల పరిషత్ ఆదర్శ పాఠశాల వద్ద 177,178 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పురుషులు 1124, మహిళలు 456 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ జానకమ్మ

ప్రజాశక్తి-కోటవురట్ల:వచ్చే నెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు, రాజకీయ నాయకులు నిబంధనలు అతిక్రమించరాదని తహసీల్దారు జానకమ్మ సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 1053 మంది పట్టబద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. కార్యాల యాలలో రాజకీయ నాయకుల చిత్రపటాలు తొలగించామని, సిబ్బందిని అప్రమత్తం చేసి గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు తలోగ్గకుండా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకొని సహకరించాలని ఆమె కోరారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు బుధవారం మానవీయ, విలువల పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సి పాల్ కొండబాబు తెలిపారు. 158 మంది విద్యార్థు లకు గాను 147 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అదేవిధంగా ఈనెల 17న మొదటి సంవత్సర విద్యార్థులకు పర్యావరణ విద్య అంశాలపై పరీక్షలు నిర్వహి స్తామని పేర్కొన్నారు.

గర్నికంలో ఘనంగా తీర్థం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గర్నికం గ్రామంలో ప్రసిద్ధి గాంచిన బాల చెంచమ్మ తీర్థ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. సంవత్సరానికి ఒకమారు నిర్వహిం చే ఈ బాల చెంచమ్మ ఉత్సవాన్ని వైభవంగా జరుగుతుంది. ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. వివాహమైన దంపతులకు మొట్టమొదటిగా జన్మించిన బిడ్డకు బాల చెంచమ్మ పేరును ప్రత్యేకంగా పెట్టడం జరుగుతుంది. ఇది మొదటి నుంచి ఆ గ్రామంలో ఆనవాయితీగా వస్తుంది.

నేడు పోతురాజుబాబు పండుగ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో వి.శరభవరం గ్రామంలో ఈ నెల 16న పోతురాజుబాబు పండుగ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవంనకు సినీనటుడు ఆలీ రానున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో స్టేజి ప్రోగ్రామ్‌లు ఏర్పాటుకు స్థలంపై టీడీపీ, వైసిపి ఇరువర్గాలు ఘర్షణ పడటంతో విషయం తెలుసుకున్న కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహ్మద్ గ్రామంలోఽ పర్యటించారు. ఇరువర్గాల వారిని సముదాయించి ఉత్సవం నిర్వహించడానికి ఆటంకం లేకుండా సమస్య పరిష్కారించారు.

అమృతకు గోల్డ్ మెడల్

భాష్యం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :చెస్ పోటీలలో పట్టణానికి చెందిన అమృత గోల్డ్ మెడల్ సాధించారు. స్థానిక భాష్యం స్కూల్‌లో అమృత ఏడవ తరగతి చదువుతుంది. విద్యార్థిని అమృత చోడవరంలో జరిగిన ఇంట్రో స్పోర్ట్స్ కాంపిటేషన్ క్రీడల్లో విజయం సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన అమృతను ప్రిన్సిపల్ శేషు, సిబ్బంది అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో బాగా రాణించాలని ఆకాంక్షించారు. భాష్యం స్కూల్ నుండి క్రికెట్, చెస్, క్యారం, కబడ్డీ వంటి పోటీలలో విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

మున్సిపాల్టీలో పారిశుధ్య పనులు ఏవీ?

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీలో మూడు నెలలుగా పారిశుధ్యం కుంటుపడిందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజక వర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, పారిశుధ్యం పనులు చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ పారిశుధ్యం మెరుగు పర్చడంలో లేదని హెద్దేవా చేశారు. జనసేన పార్టీ 9వ వార్డు కౌన్సిలర్ ఎంఅడ్డేపల్లి సౌజన్య మాట్లాడుతూ, తన వార్డులో సొంత నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు పాల్గొన్నారు.



ఇసిజి మిషన్‌ను అందజేస్తున్న హెటిరో ప్రతినిధులు

పిహెచ్‌సికి 'హెటిరో' ఇసిజి మిషన్ అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల పిహెచ్‌సి కి హెటిరో డ్రగ్స్ కంపెనీ ప్రతినిదులు ఈసీజీ మిషన్‌ను అందజేశారు. బుధవారం ఆసుపత్రిలో వైద్యులు కిషోర్ కుమార్‌కు కంపెనీ ప్రతినిధులు ఎం సుబ్బారెడ్డి, ఎస్.కుల్లాయి రెడ్డి చేతుల మీదుగా ఈసీజీ మిషన్‌ను అందజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి ఈసీజీ మిషన్ సౌకర్యం కల్పించాలని డాక్టర్ కిషోర్ కుమార్ హెటిరో యాజమాన్యాన్ని కోరారు .ఈ మేరకు యాజమాన్యం స్పందించి సుమారుగా రూ.75 వేల విలువైన ఈసీజీ మిషన్ ను కొనుగోలు చేసి ఆసుపత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు పూడుస్తున్న కూలీలు

రహదారి గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో కవగుంట గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డున పడిన గుంతలను పూడ్చి వేస్తున్నట్లు సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అధిక బరువుతో కూడిన వాహనాలు ఈ రహదారి గుండా నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని గోతులమయం అయ్యిందన్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రావెల్ మట్టిని వేయించి గోతులు పూడ్చడం జరిగిందని తెలిపారు. గుంతల పూడ్చివేతతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నినాదాలు చేస్తున్న సత్యనారాయణ, కూలీలు

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో రేవుపోలవరం గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలతో నిరసన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధి బకాయిలు మూడు వారాల పేమెంట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎంపిడిఒ ఈ మధ్యకాలంలో ఏ గ్రామంలో కూడా పనులు సందర్శించ లేదన్నారు. కొన్ని గ్రామాల్లోనే పర్యటనకు పరిమితం అవుతున్నారన్నారు. పని ప్రదేశంలో పర్యటన చేసి కూలీల సమస్యల్ని తెలుసుకోవాలన్నారు. మంచినీళ్లు, పనిముట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. పని దినాలు కూడా బోర్డులలో ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సామగ్రి ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

హాకి సామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని పి.అగ్రహారం ధర్మవరంలో అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ బ్యాట్స్, బాల్స్ ఉపాధ్యాయులకు అందజేశారు. పిల్లలు హాకీపై మక్కువ చూపించి మరింతగా రాణించాలని ఆశా భావం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో చినపాచిల గ్రామంలో మాజీ సర్పంచ్, కీర్తిశేషులు సానుబిల్లి హరిహరరావుకు ప్రభుత్వ విప్, చోడవరం శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ నివాళులు అర్పించారు. కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, కోపరేటివ్ సొసైటి అధ్యక్షునిగా, గ్రామపంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించి ప్రజల మన్ననలు హరిహరరావు పొందారన్నారు. నివాళులు అర్పించిన వారిలో చినపాచిల సచివాలయం కన్వీనర్ కుమార ప్రసాద్, ఎంపిటిసి బంటు శ్రీను, మేడివాడ కోపరేటివ్ అధ్యక్షులు కోటి, బంటు సన్యాసినాయుడు ఉన్నారు.

బాల కార్మికులపై ఆరా తీస్తున్న రామచంద్రరావు

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-గొలుగొండ: బాల కార్మిక నిర్మూలన, వెట్టిచాకిరి నుంచి విముక్తికి గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు నర్సీపట్నం లేబర్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ బి.రామచంద్రరావు అన్నారు. బుధవారం కేడిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో పెట్రోల్ బంకులు, ఇటుక బట్టీలు, షాపులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వెట్టిచాకిరి నిర్మూలన దినం సందర్భంగా ఈ నెల 16వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా లేబర్ సర్టిఫికెట్లు, లేబర్ ఇన్సూరెన్స్ ఇతర సౌకర్యాలపై తనిఖీలు చేపడతామన్నారు. కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి వర్మ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పీఠం దక్కేదెవరికో?

-పాలకవర్గం ఏర్పడి రెండు నెలల్లో రెండేళ్లు పూర్తి -పలువురు ఆశావాహులు ముమ్మరంగా ప్రయత్నాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న తరుణంలో ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్ గా పని చేస్తున్న ఆదిలక్ష్మి కొనసాగుతారా లేదా ఆనాడు అనుకున్న ప్రకారం వార్డ్ కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి కొనసాగుతారా అనేది మునిసిపల్ ప్రజల్లో ఆసక్తిగా రేకెత్తిస్తోంది. మున్సిపల్ ఎన్నికలు జరిగిన అనంతరం వైసిపి పెద్దలు నిర్ణయం మేరకు రెండు సంవత్సరాలు పదవి అనంతరం చైర్ పర్సన్‌ను మార్పు చేయడం జరుగుతుందని, మరల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆనాడు నిర్ణయించడం జరిగింది. ఆనాడు మున్సిపల్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, వైసిపి పెద్దలు రెండు సంవత్సరాల తర్వాత కొత్తవారికి పాలకవర్గంలో స్థానం కల్పిస్తామని నిర్ణయించారు. దీంతో పలువురు ఆశావాహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. పాలకవర్గంలో మార్పులు చేర్పులు మాత్రమే ఉంటాయా లేక పునర్వ్యవస్థీకరణ జరుగుతుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇంకొక రెండు నెలలలో పదవి కాలం పూర్తవుతున్న తరుణంలో కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు పదవులపై ఆశ పడుతున్నారు. 2021 మార్చి నెలలో ఎన్నికలు జరగ్గా నర్సీపట్నం 28 వార్డులకు గాను తెలుగుదేశం పార్టీ నుండి 12, వైసిపి పార్టీ నుండి 14, జనసేన పార్టీ నుండి ఒకటి, ఇండిపెండెంట్ ఒకటి గెలవగా ఎంపీ, ఎమ్మెల్యే కో ఆప్షన్ సభ్యులుగా ఉండడంతో 16తో కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆనాడు ప్రమాణస్వీకారం అనంతరం రెండు సంవత్సరాల తర్వాత మునిసిపాలిటీ పాలకవర్గం మార్పు ఉంటుందని అప్పుడే వైసిపి పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రెండు సంవత్సరాలకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం మార్చి నెలతో రెండు సంవత్సరాలు పూర్తి వడంతో కొందరు ఆశావాహులు ఎదురు చూస్తున్నారు.



ఆదిలక్ష్మి
సుబ్బలక్ష్మి

నర్సీపట్నం చైర్ పర్సన్ పీఠాన్ని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించారు. వైసిపి నుంచి అప్పట్లో ఎస్సీ అభ్యర్థులు ఇద్దరు గెలుపొందగా మొదటి సంవత్సరం ఆదిలక్ష్మికి అవకాశం ఇవ్వగా.. రెండో సంవత్సరం సుబ్బలక్ష్మికి ఇవ్వాలని వైసిపి పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మున్సిపల్ సమావేశాల్లో ప్రతిపక్ష కౌన్సిలర్లను ఎదుర్కొని సరైన సమాధానం ఇవ్వడంలో చైర్ పర్సన్ ఆదిలక్ష్మి ఎంతో చాకచక్యంగా తనదైన శైలిలో సమాధానం ఇస్తూ సభను నడిపిస్తున్నారు. జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మున్సిపాలిటీ సమావేశాల్లో దీటుగా ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షం కౌన్సిలర్ల ప్రశ్నకు ఆదిలక్ష్మి చాలా చాకచక్యంగా స్పందిస్తూ సమాధానాలు ఇస్తుంటారు. మున్సిపల్ వార్డు కౌన్సిలర్ల పాలకవర్గంలో అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య మనస్పర్థలు ఏర్పడి ఒక వర్గం ఆదిలక్ష్మిని ఇబ్బంది పెట్టాయి. ఈ రెండు సంవత్సరాల్లో ఆమె చాలా ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. విశ్వసనీయ సమా చారం మేరకు ఇదిలా ఉండగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి పాయకరావుపేట శాసనసభ సీటును ఆశిస్తు న్నట్టు తెలుస్తుంది. వైస్ చైర్మన్ పదవి పై కొందరు ఆశలు పెట్టుకున్నారు. పున పాలకవర్గం ఏర్పడితే పీఠం ఎవరికి దక్కుతుందో ? వైస్ చైర్మన్ ఎవరో అవుతారో వేచి చూడాల్సిందే.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి- యస్.రాయవరం: ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గోకులపాడు గ్రామం లోని తులసి కల్యాణ మండపంలో గృహ సారథుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల్లోకి వెళ్లి జగనన్న అమలు చేసిన పథకాలను వివరించాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువై 2024 ఎన్నికల్లో మళ్ళీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. టిడిపి పార్టీకి ఎల్లో మీడియా రథ సారథులని, ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, రానున్న కాలం ప్రతి ఒక్కరికి ఎంతో విలువైనందున కష్టపడి పార్టీ కోసం శ్రమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, నూకి నాయుడు, శ్రీపతి రాజు, మాతా గురునాధరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నిలకంఠేశ్వరస్వామి ఆలయం

శివరాత్రికి ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 18న జరిగే మహాశివరాత్రికి మండలంలోని ఏఎల్‌పురం నీలకంఠేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతుంది. మూడు రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలకు నిర్వహిస్తారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పురోహితులు బద్రి తెలిపారు. గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద కూడా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని పురోహితులు కేశనకుర్తి వీర్రాజు పేర్కొన్నారు.

అయ్యన్నతో పార్టీకి ముప్పు

తనపై అధిష్టానికి తప్పుడు సమాచారం ఇచ్చారు
టిడిపి సీనియర్ నేత, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి శ్రీరామూర్తి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మాజీ అయ్యన్న వంటి వారితోనే తెలుగుదేశం పార్టీకి ముప్పు వాటిల్లుతుందని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, టిడిపి నేత ఈర్లె శ్రీరామూర్తి తెలిపారు. స్థానిక కృష్ణా ప్యాలెస్‌లో బుధవారం విలేకరు సమావేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామమూర్తి తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్టీ రామారావు హయాం నుండి తెలుగుదేశం పార్టీకి ఎంతో సేవలు తాను అందించానని, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు కారణంగా తన వంటి వారికి గుర్తింపు లేకుండా పోతుందన్నారు. పార్టీ నాయకులు అచ్చం నాయుడు, చంద్రబాబు తనను గుర్తించినప్పటికీ తప్పుడు సమాచారాన్ని ఇచ్చి వారిని అయ్యన్న పక్కతోవ పట్టించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా, ఏపీ జేఏసీ అమరావతి పూర్వపు ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనేక పదవులు చేశానని గుర్తు చేశారు. తాను గంటా శ్రీనివాస్‌తో తిరుగుతున్నాననే నెపం వేసి ఎమ్మెల్సీ అవకాశాన్ని అయ్యన్న తప్పించారని ఆవేదన చెందారు. ఇలాంటి వారితో పార్టీకి ఎంతో చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. బిసి నాయకుడిగా చెప్పుకునే అయ్యన్న వెలమ నేతనైన తనకు ద్రోహం తలపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ విఆర్‌ఓ టి చినబాబు, మాజీ గ్రామ రెవెన్యూ సంఘం నాయకులు త్రినాధరావు, పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు కే.దేవుడు పాల్గొన్నారు

మాట్లాడుతున్న శ్రీరామూర్తి

అధిష్ఠానాన్ని పక్కదోవ

ప్రజాశక్తి -రోలుగుంట: ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి బుధవారం రోలుగుంటలో పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు టీడీపీ అధిష్టానాన్ని పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి సీనియర్‌గా పార్టీలో పని చేస్తున్న తన వంటి సీనియర్ నాయకులకు అన్యాయం చేయడంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా వివిధ హోదాల్లో పని చేసిన తనకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమాచార హక్కు కమిషనర్ పదవికి చంద్రబాబు సిఫార్సు చేశారని, ప్రతిపక్ష నాయకుడు జగన్ మద్దతు ఇచ్చారని చివరి క్షణంలో అయ్యన్న చక్రం తిప్పి తనకు పదవి రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. పార్టీ తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు సీటు ఇవ్వాలని అధిష్టానం మొగ్గు చూపిందని, అయ్యన్నపాత్రుడు తనకు సీటు రానివ్వకుండా మరొకసారి అడ్డుపడ్డారని విమర్శించారు.

కేక్ తినిపిస్తున్న పివిఎస్ఎస్ రాజు

ఘనంగా రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండల జనసేన ఉపాధ్యక్షుడు తుంపాల రమేష్ 36వ జన్మదిన వేడుకలు వడ్డాదిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గా జన సేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ఎస్ రాజు హాజరై రమేష్‌కి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం అహర్నిశలు పాటు పడుతున్న రమేష్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ నాయుడు, యడ్ల రాంమూర్తి, దొండా సాయి, జన సైనికులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు